క్లుప్తంగా

అసమానతలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చదువుతో పాటు సమాజాన్ని కూడా చదవాలని, అసమానతలు లేని నూతన సమాజాన్ని నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి ఎం.శంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం పీడీఎస్‌యూ నంద్యాల పట్టణ జనరల్ బాడీ సమావేశం నవీన్ అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ విద్యారంగంలోని వారి హక్కులను కాపాడుకోవాలని, అవినీతి లేని సమాజాన్ని ఆకాంక్షిస్తూ చైతన్యవంతులు కావాలని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పీడీఎస్‌యూ పట్టణ అధ్యక్షుడిగా షాహిద్, కార్యదర్శిగా వినోద్, ఉపాధ్యక్షులుగా నవీన్, సహాయ కార్యదర్శిగా గిరి, శంకర్, కోశాధికారిగా అనిల్ ఎన్నికయ్యారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్):విద్యార్థినుల పట్ల అశ్రద్ధ వహించిన హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విప్లవ విద్యార్థి సంఘం కార్యదర్శి లోకేష్, అఖిల భారత విప్లవ మహిళా సంఘం కార్యదర్శి కృష్ణవేణి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా గోస్పాడు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో పాముకాటుకు గురైన విద్యార్థిని పాఠశాల యాజమాన్యం పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల సమస్యలు పట్టించుకోవాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజనాన్ని కొనసాగించాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని కొనసాగించాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని పద్మావతినగర్ ఆర్చి వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజనాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఎత్తివేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి చదువుకోవడానికి పట్టణ ప్రాంతాలకు వచ్చేటువంటి పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలోఏఐఎస్ఎఫ్ జిల్లానాయకులు సురేష్, ఎర్రిస్వామి, బాలాజీ, రమణ పాల్గొన్నారు.

చెత్త తొలగింపు



రహదారి ఇరువైపులా చెత్తను తొలగిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో మంగళవారం ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా వున్న చెత్తాచెదారాన్ని తొలగించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మా యలూరు, ఆళ్లగడ్డ ప్రధాన రహదారిలో చెత్తా చెదారం, ప్లాస్టిక్ కవర్లు నిల్వ చేయడంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రయాణికు లు ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన అధికారులు తొలగింపునకు చర్యలు తీసుకోవడంతో సమస్య పరిష్కారమైంది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల ఓబులేస్, పంచా యతీ కార్యదర్శి జయరామిరెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలోని సచివాలయంలో మంగళవారం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఆధార్ కార్డులో సవరణలు, ఫోన్‌నంబర్ లింక్ తదితర వాటిని నమోదు చేస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి చెప్పారు. ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగానే సేవలు అందిస్తారమన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

దొర్నిపాడు: సాగుకు ముందు విత్తనశుద్ధి చేసుకోవడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక సమన్వయకర్త డాక్టర్ సరళమ్మ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో పర్యటించి ఆర్‌బీకేను పరిశీలించారు. బీపీటీ-3082 వరి మినీకిట్స్‌ను రైతులకు అందజేశారు. సూచనలు సలహాలు కావాలంటే ఏరువాక కేంద్రం 9440312367 మొబైల్ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. అనంతరం రైతుల పొలాలను పరిశీలించి ఖరీఫ్‌లో సాగు చేయనున్న పంటల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ(డీఆర్‌సీ) ప్రభావతమ్మ, వీఏఏలు వినోద్‌కుమార్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

శిరివెళ్ల: వర్షాకాలంలో అంటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్ఓ వెంకట రమణ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయకుమార్, సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసనలు

- వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్న సామాన్యులు
- నిస్వార్థంగా సేవలందించారంటూ వలంటీర్లపై ప్రశంసలు



ఎస్ఐ నాగార్జునరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న న్యాయవాదులు

ఆళ్లగడ్డ: జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసనలు వెల్లువెత్తాయి. పట్టణంలో మంగళవారం పవన్ దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం వలంటీర్లు నిరసన తెలిపారు. పవన్ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధికోసం మంచి సేవలు అందిస్తున్న వలంటీర్లను దుర్మార్గంగా మాట్లాడటంతో మండి పడ్డారు. ఇదిలా ఉండగా కోవిడ్ మహమ్మారి నుంచి తమను కాపాడిన వైద్యులతో పాటు అన్ని రకాల సదుపాయాలను కల్పించి వలంటీర్లు చేసిన సేవలను ఎప్పటికీ మర్చి పోలేమని ప్రజలు పేర్కొంటున్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా సేవలు చేస్తున్న వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నారు.

పవన్ కల్యాణ్‌పై న్యాయవాదుల ఫిర్యాదు

బొమ్మలసత్రం: ప్రజలకు సేవచేస్తూ పలు ప్రభుత్వ పథకాలను ఇళ్ల ముంగిటికి తీసుకెళ్లే వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన ఆరోపణలు హేయమైనవని, వెంటనే ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య డిమాండ్ చేశారు. మహిళలపై నిందలు వేయటం చట్టప్రకారం నేరమని వెంటనే పవన్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని టూటౌన్ ఎస్ఐ నాగార్జున రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఏలూరులో వలంటీర్లపై నిరాధారమైన ఆరోపణలు చేయటం బాధాకరమన్నారు. సచివాలయ వలంటీర్లపై విషం చిమ్ముతూ విద్వేషాలు రెచ్చగొట్టేలా ఆయన ప్రసంగించడం దారుణమన్నారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ లీగల్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తిమ్మారెడ్డి, సుబ్బయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా సేవలు



తెల్లవారకముందే లక్ష్మీదేవికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రవీంద్రారెడ్డి

బత్తలూరుకు చెందిన వలంటీర్ రవీంద్రారెడ్డి నిజాయితీగా సేవలందిస్తున్నాడు. ఇతనికి కేటాయించిన 50 ఇళ్లలో ఎవరితోను అసభ్యంగా ప్రవర్తించడం కానీ, వారి సమాచారంను దుర్వినియోగం చేయలేదు. కరోనా సమయంలో ధైర్యంగా బయటికి వచ్చి తన పరిధిలోని లబ్ధిదారులకు సేవలందించాడు. వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేయడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన మందులను అందజేశాడు. వారికి ఏ అవసరం వచ్చినా కుటుంబ సభ్యుడిలా వచ్చి సేవలందించాడు.

తోబుట్టువులా వలంటీర్



నాకు ప్రభుత్వం నుంచి ప్రతి నెలా వస్తున్న వితంతు పింఛన్‌ను వలంటీర్ రవీంద్రారెడ్డి ఇంటి వద్దకు వచ్చి తోబుట్టువులా పిలిచి రూ.2,750 నగదును అందజేస్తున్నాడు. ఏ అవసరం వచ్చినా ఓ సొదరుడిలా ఆప్యాయంగా ప్రభుత్వంకు సంబంధించిన సేవలను అందిస్తున్నాడు. చదువురాని మేము కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడేవాళ్లం. అలాంటిది మాకు ఇంటి వద్దకు వచ్చి మాకు కావాల్సిన ధ్రువపత్రాలను అందజేస్తున్నాడు. – లక్ష్మీదేవి, బత్తలూరు

కుటుంబ సభ్యుడిలా..



ఇతనిపేరు రాంపుల్లయ్య, దొర్నిపాడు మండలం డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వలంటీర్‌గా సేవలందిస్తున్నాడు. గత నాలుగేళ్లుగా జగనన్న ప్రభుత్వం అమలు చేసిన ఎన్నో సంక్షేమ పథకాలు లబ్ధిదారుల దరి చేర్చాడు. ఏనాడే గాని తనకు కేటాయించిన గృహాల్లోని మహిళపట్ల అసభ్య ప్రవర్తన చేయలేదు. తెల్లవారకముందే ఇంటివద్దకు వెళ్లి పింఛన్లు అందజేస్తున్నాడు. కుటుంబ సభ్యుడిలా వారికి ఏ పని కావాలన్నా చేసి పెడుతున్నాడు. గతంలో కరోనా మహమ్మారి వ్యాపించిన సమయంలోనూ ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేసి వృద్ధుల దీవెనలు పొందాడు. అంతేకాకుండా నడవలేని వృద్ధులను ఆసుపత్రికి తీసుకెళ్లి కవాల్సిన వైద్య పరీక్షలు చేయించి, అవసరమైన వైద్యం చేయించాడు.

మనవడిలా సేవలు చేస్తున్నాడు

వలంటీర్ రామనాథ్‌రెడ్డి నాకు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తున్నాడు. ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ వచ్చి పనులు చేసిపెడుడుతున్నాడు. వలంటీర్ వచ్చినప్పటి నుంచి నాకు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తున్నాడు. గతంలో కార్యాలయాల చుట్టు తిరిగి అలసి పోయేదాన్ని. ప్రస్తుతం ప్రతి నెల నిద్రలేపి పింఛన్ సొమ్మును ఇస్తున్నాడు. అలాగే అధార్‌కార్డు ఫోన్ లింక్, వేలి ముద్రలు పడక పోయినా సరిచేస్తున్నాడు. ఆరోగ్యం సరిగ్గా లేకపోయినా 104 వాహనం వద్దకు తీసుకెళ్లి వైద్యం చేయిస్తున్నాడు. నానుంచి ఒక్క రూపాయి ఆశించకుండా మనువడిలా పని చేస్తున్నాడు. – అచ్చమ్మ, డబ్ల్యూ.గోవిందిన్నె

ప్రతి సమస్యను పరిష్కరించాలి

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- చాగలమర్రిలో గడప గడపకు మన ప్రభుత్వ ముగింపు సమావేశం



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: 15 రోజుల పాటు చాగలమర్రిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆదేశించారు. మంగళవారం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో కార్యక్రమం ముగియడంతో మంగళవారం కొటగడ్డ వీధిలోని 4వ సచివాలయ కార్యాలయంలో జిల్లా, మండల ప్రభుత్వ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశాన్ని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వచ్చిన గృహ నిర్మాణ శాఖకు చెందిన సమస్యలను, గత ప్రభుత్వ హయాంలో రూపాయి ఖాతాలో పడి ఆ తరువాత బిల్లులు నిలిచిపోయిన లబ్ధిదారులు మండలంలో 2140 మంది ఉన్నారని, వారికి కూడా బిల్లులు మంజూరు చేయాలని తమ దృష్టికి తెచ్చారని చెప్పారు. ఈ సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరించాలని గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్‌రావును ఆదేశిచారు. చాగలమర్రిలో జగనన్న లే అవుట్లలో ఇప్పటి వరకు వచ్చిన 1,560 మంది దరఖాస్తు దారులలో 130 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయవలసి ఉందని, వారికి కావాలసిన స్థలాన్ని సేకరించాలని ఆర్డీఓ శ్రీనివాసులుకు ఎమ్మెల్యే సూచించారు. చాగలమర్రి గ్రామంలో విద్యుత్ రిపేరిల కోసం రూ. 30 లక్షలు మంజూరయ్యాయని, ఈ నిధుల ద్వారా గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఏఈ షాజహాన్‌ను ఆదేశించారు. అనంతరం ముగ్గురికి ఇళ్ల పట్టాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ మైనారిటి సెల్ ప్రధానకార్యదర్శి షేక్.బాబులాల్, కన్వీనర్ కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, మండల కో-ఆప్షన్ సభ్యుడు జి.ఇబ్రహీం, వైస్ ఎంపీపీ ములా రఫి, సర్పంచ్ గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

43,555 పక్కా గృహాలు మంజూరు



మాట్లాడుతున్న ఆర్డీఓ, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు

చాగలమర్రి: ప్రతి నిరుపేదకు పక్కా గృహ సదుపాయాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఎడాదికల్లా రాష్ట్రంలో 5 లక్షల ఇళ్లు నిర్మించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాల జిల్లాకు 43,555 పక్కా గృహాలను మంజూరు చేసినట్లు నంద్యాల ఆర్డీఓ, ఆళ్లగడ్డ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం చాగలమర్రి తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గృహనిర్మాణ పథకం ద్వారా జిల్లాకు 315 జగనన్న లే అవుట్లలో సుమారు 22,521 ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి వారికి పక్కా గృహాలు కూడా మంజూరు చేసిందన్నారు. అలాగే సొంత స్థలాలు కలిగివున్న 20,974 మందికి కూడా ఇళ్లను మంజూరు చేసిందన్నారు. వాటిలో ఇప్పటి వరకు 15,555 పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. ఇంకా 12,300 బీబీఎల్ స్టేజిలో ఉన్నాయన్నారు. వీటి నిర్మాణం కొరకు ప్రభుత్వం ఇప్పటికి రూ.397 కోట్ల నగదును వెచ్చించిందని చెప్పారు. అంతేకాకుండా జిల్లాలో పీఎంఏవై పథకం ద్వారా 12,967 పక్కా గృహాలు మంజూరు చేసిందన్నారు. వాటిలో ఇప్పటి వరకు 11,000 నిర్మాణాలు పూర్తయి, బిల్లులను గ్రౌండింగ్ చేశామని చెప్పారు. వివిధ దశలలో నిర్మాణంలో నిలిచి పోయిన గృహాల లబ్ధిదారులకు ప్రభుత్వం అడ్వాన్సుగా రూ.40,000 లు మంజూరు చేస్తూ వెసులుబాటు కల్పించిందని తెలిపారు. అలాగే కూడా కింద నిర్మిస్తూ మధ్యలో ఆగిపోయిన నిర్మాణాలకు రూ.20,000 అడ్వాన్సుగా ఇస్తుందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో హౌసింగ్ ఈఈ మాధవరావు, డీఆర్‌డీఏ పీడీలు శ్రీధర్‌రెడ్డి, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజీ ఆవరణలో మంగళవారం ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ వేడుకలను యూనియన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి పంపిపెట్టారు. జిల్లా రవాణా అధికారి శ్రీనివాసులు, డిపో మేనేజర్, గంగాధర్‌లు, సీఐలు, మెడికల్ ఆఫీసర్లు శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, ఆర్ఎస్‌రావు, నాయకులు రాయుడు, గిరికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి



చిన్నారులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బాలాజీ

ఉయ్యాలవాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్యామిలీ ఫిజిషియన్‌లో భాగంగా ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తోందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి రమేష్ చంద్ర బాలాజీ సూచించారు. మంగళవారం మండలంలోని సుద్దమల్ల గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్‌లో భాగంగా గ్రామంలోని 97 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే మధ్యాహ్నం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంటు దస్తగిరి, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్ల అభివృద్ధికి కృషి



సతీష్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): రెడ్డి సామాజికవర్గ బలోపేతానికి శాయశక్తుల కృషి చేస్తానని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ నంద్యాల నియోజకవర్గ కన్వీనర్ దేవన వెంకటసత్యనారాయణరెడ్డి(సతీష్‌రెడ్డి) తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు, ఇతర రెడ్డి సంఘాల సమన్వయంతో రెడ్డి జాతి సంఘాభివృద్ధికి పాటు పడతానన్నారు. సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డిలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు.

అందరి సంక్షేమమే ధ్యేయం

ఉయ్యాలవాడ : అందరి సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని సుద్దమల్ల గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీతో పాటు గ్రామ సర్పంచ్‌లు పల్లె రామమద్దిలేటిరెడ్డి, గురుప్రసాద్ రెడ్డి, హసానమ్మ, మండల వైఎస్ఆర్‌సీపీ కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని పలు రకాల ధ్రువపత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో వందశాతం లబ్ధి

దొర్నిపాడు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వందశాతం లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చాకరాజువేముల గ్రామంలో జగన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 850 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని చాకరాజువేముల గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని టాస్క్ ఫోర్స్ టీం డీఎల్‌డీఓ జనార్దనరావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తనిఖీ చేశారు.

458 మందికి సర్టిఫికెట్లు పంపిణీ

శిరివెళ్ల: చెన్నూరు గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో 458 మందికి వివిధ సర్టిఫికెట్లను సర్పంచు చిట్టిబాబు, ఎంపీడీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ పంపిణీ చేశారు. మాజీ సర్పంచు మేర్వ నాగభూషణం రెడ్డి, ఏఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : రూరల్ మండలం నల్లగట్ల గ్రామ సచివాలయ పరిధిలో ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ 397 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈఓఆర్డీ తోహర్‌హుస్సేన్, సర్పంచ్ రామకృష్ణ, ఎంపిటీసీ మహాలక్ష్మి, నాయకులు భాస్కర్‌రెడ్డి, మద్దిలేటి, క్రిష్టారెడ్డి తదితరులు ఉన్నారు

రుద్రవరం:మండల పరిధిలోని ముత్తలూరులో సర్పంచు మహేశ్వరి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 134 మంది లబ్ధిదారులకు తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, ఎంపీడీఓ మధుసూదనరెడ్డి తదితరులు ధ్రువ పత్రాలు అందజేశారు.

చాగలమర్రి: మండలంలోని నెలంపాడు గ్రామంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా అధ్యక్షతన మంగళవారం జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పోన్నతోట ప్రతాప్‌రెడ్డి 77 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

జనాభా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత



ర్యాలి నిర్వహిస్తున్న డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ

నంద్యాలటౌన్: రోజు రోజుకు పెరిగి పోతున్న జనాభాతో దుష్పరిమాణాలు తలెత్తే ప్రమాదం ఉందని జనాభా నియంత్రించాల్సిన బాధ్యత మన అందరి పై ఉందని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ అన్నారు. జనాభా నియంత్రణకు తీసుకోవల్సిన చర్యల పై గ్రామీణులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సాయిబాబా నగర్ ఆర్చి వద్దనున్న వైఎస్సార్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు మల్లికార్జున రెడ్డి, కాంతారావు, నోడల్ ఆఫీసర్ జగదీష్ చంద్రారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యాళ్లూరులో నేడు వైద్య శిబిరం

గోస్పాడు: యాళ్లూరు సీహెచ్‌సీ ఆసుపత్రిలో బుధవారం చిన్న పిల్లల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్య అధికారులు రాజేష్ కుమార్, మాధవి, ప్రసన్న తెలిపారు. వారు మాట్లాడుతూ బరువు తక్కువ పిల్లలు, ఎదుగుదల లోపం ఉన్న వారికి, ఫిట్స్, ఉబ్బసం పసిరీకలు, మలేరియా, డెంగీ, రక్తహీనత తదితర వ్యాధులపై పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

యువతి అదృశ్యం



పోలక్క(ఫైల్)

ఉయ్యాలవాడ : మండలంలోని సర్వాయిపల్లె గ్రామానికి చెందిన లింగం నడిపి పోలయ్య కుమార్తె చిన్నపోలక్క(17) అలియాస్ వెన్నెల అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు పోలక్క స్వగ్రామం నుంచి సోమవారం ఉదయం కాలేజీకి బస్సులో ఎక్కి వెళ్లింది. ఆళ్లగడ్డ పట్టణంలోని ఓ కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతోంది. ఆ రోజు రాత్రైనా ఇంటికి రాలేదు. కుమార్తె ఆచూకి కోసం బంధువులు, స్నేహితుల వద్ద తండ్రి విచారించినా లభ్యం కాలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

పాఠశాలలో చేరేందుకు నేడు చివరి రోజు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలోని 27 కె.జీ.బీ.వి పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు బుధవారం చివరి రోజని, విద్యార్థులందరూ తప్పకుండా పాఠశాలల్లో చేరాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఖాళీగా మిగిలిపోయిన సీట్లను అర్హులైన విద్యార్థినులకు కేటాయించిన పాఠశాలల్లో రిపోర్టు చేయాలన్నారు.

మండల రిసోర్స్ కోఆర్డినేటర్‌గా జర్మియా

దొర్నిపాడు: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల రిసోర్స్ కో ఆర్డినేటర్‌గా జర్మియా మంగళవారం విధుల్లో చేరారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు వీరిని అనుసంధానిస్తూ ఉమ్మడి జిల్లా కలెక్టర్ సృజన ఇచ్చిన ఉత్తర్వులను ఎంపీడీఓ సుబ్బారెడ్డికి అందజేశారు. సాక్షర భారత్ కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్లుగా విధులు నిర్వహిస్తున్న వీరికి పాదయాత్రలో జగనన్న ఇచ్చిన హామి మేరకు ఉద్యోగాలు కల్పించారు.

మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్

బొమ్మలసత్రం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఫోన్‌పే, గూగుల్‌పే, ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా వినియోగదారులు మద్యం కొనుగోలు చేయవచ్చని, దుకాణాల్లో యూపీఐ యాప్‌లను అనుమతించని ఉద్యోగులపై తమకు ఫిర్యాదు చేయవచ్చని ఎక్సైజ్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలను సెబ్ అధికారులు తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వినియోగదారులు తప్పని సరిగా డిజిటల్ పేమెంట్ ద్వారా మద్యం కొనుగోలు చేయాలని సూచించారు. కేవలం చీప్ లిక్కర్ కొనుగోలు చేసే పేదలు మాత్రమే నగదు ఇచ్చి మద్యం తీసుకునే వెసలు బాటు కల్పించామని పేర్కొన్నారు. మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులు తప్పనిసరిగా నిభంధనలు పాటించాలని అతిక్రమించిన వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సైలు వెంకటేశ్వర్లు, అస్లామ్‌బేగ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అష్టాదళ పాద పద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో ఆషాడమాసం మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడిబియ్యం కార్యక్రమాన్ని సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు గ్రామాల్లోనే సత్వర సేవలు

గోస్పాడు: ప్రజలకు గ్రామాల్లోనే సత్వర సేవలు అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి అన్నారు. మండలంలోని కానాలపల్లె గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు మీ సేవ కేంద్రాలను, మండల కార్యాలయను సంప్రదించాల్సి వచ్చేది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లోనే సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఎంపీడీఓ భాస్కర్, ఇన్‌చార్జి తహసీల్దార్ విజయశేఖర్, డీటీ రామచంద్రారావు, ఇతర మండల అధికారులు, ఆయా శాఖల సిబ్బంది ఆధ్వర్యంలో ప్రజలకు అక్కడికక్కడే 246 ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, ఉప మండలాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, సర్పంచ్ గడ్డం లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(సిటీ): జగనన్న సురక్ష క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో పలు ప్రాంతాలలో పర్యటించిన ఆయన ప్రజలకు జగనన్న సురక్ష క్యాంపుల పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష క్యాంపులు పట్టణంలో 11వ వార్డు ప్రజలు శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న వివేకానంద ఆడిటోరియంలో, 13,14, 15,16 వార్డులకు సంబంధించిన వారికి మార్కెట్ యార్డులో క్యాంపులు నిర్వహిస్తామన్నారు. మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కృష్ణా నదిపై బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించాలి

నంద్యాల(అర్బన్): కృష్ణా నదిపై ఐకాన్ బ్రిడ్జి (తీగల వంతెన) ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలపటంపై రాయలసీమ స్టీరింగ్ కమిటీ జిల్లా నాయకులు రమణా రెడ్డి, కోటేశ్వరరావుల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బస్టాండ్ సమీపంలోని బాబు జగజ్జీవనర్ రావు విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. రమణారెడ్డి మాట్లాడుతూ కృష్ణా నదిపై బ్రిడ్జి కం బ్యారేజీ ఏర్పాటు చేస్తే రాయలసీమ వాసులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ ఆర్ఐ జిల్లా కార్యదర్శి గాలి రవిరాజు, నాయకులు రమేష్, గౌరీశంకర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

నంద్యాల(సిటీ): పట్టణంలో అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ఆఫీసర్, టౌన్ ప్లానింగ్ సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ రవింద్రారెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక రైతునగర్ ప్రాంతంలో అన్ ఆథరైజ్డ్ లే అవుట్లు, అక్రమ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలకు వారం లోగా నోటీసులు జారీ చేసి చర్యలకు ఉపక్రమించాలన్నారు. ఇన్‌చార్జ్ ఆర్ఓ వెంకట క్రిష్ణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

జలచౌర్యంపై ఎస్పీకి ఫిర్యాదు

నంద్యాల(సెంట్రల్): సీమ సాగు, తాగునీటికి కీలకమైన శ్రీశైలం జలాశయంలో జలచౌర్యాన్ని కనిపెట్టాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి మంగళవారం ఎస్పీ రఘురామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. జలాశయంలో మే 31 నాటికి చట్టప్రకారం నిల్వ ఉండాల్సిన 150 టీఎంసీల స్థానంలో కేవలం 34 టీఎంసీల నీరు మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 120 టీఎంసీల నీరు ఏమైందో విచారించాలని కోరారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు ఏరువ రామచంద్రారెడ్డి, వైఎస్ రెడ్డి, వెంకటేశ్వరనాయుడు, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

నంద్యాల(అర్బన్): అంగన్‌వాడీ వర్కర్లకు సంక్షేమ పథకాలు వర్తించేలా చూడాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి కోరారు. అంగన్ వాడీ సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం నూనెపల్లె జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన 36 గంటల ధర్నా ముగించారు. నాయకులు ఏసురత్నం, నాగరాజు, తోటమద్దులు పాల్గొన్నారు.